సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రంగసాయి భట్

అధికారుల నిర్లక్ష్యం.. ఢిల్లీలో శకటానికి దక్కని చోటు!

గణతంత్ర వేడుకల్లో తెలంగాణ శకటానికి అగౌరవం

విశ్రాంత ఐ అండ్ పీఆర్ అధికారి రంగసాయి

ఖైరతాబాద్, డిసెంబర్ 13(నమస్తే తెలంగాణ): ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో ఈ సారి తెలంగాణ శకటానికి చోటు దక్కలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే తెలంగాణకు గౌరవం దక్కలేదని విశ్రాంత ఐ అండ్ పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ రంగసాయి భట్ విమర్శించారు. అలసత్వం ప్రదర్శించిన అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని, ఉత్సవాల్లో తెలంగాణ శకటం పాల్గొనేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ వీ4 మేక్ యువర్స్ సంస్థ 1970 నుంచి ఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్ కోసం శకటాలను రూపకల్పన చేస్తున్నదని తెలిపారు. ఆదిలాబాద్ కాటన్ మార్కెట్, నాగోబా జాతర, చిందు భాగవతం, రామప్ప దేవాలయ, ఫణిగిరి బుద్ధవనం, మహబూబ్‌నగర్ డైమండ్ మైన్స్ డిజైన్లను ప్రభుత్వానికి పంపగా రామప్ప దేవాలయ శకటం ఎంపికయ్యిందని చెప్పారు. ఆ ఫైల్‌కు ఐ అండ్ పీఆర్ శాఖ అధికారులు సీఎం ఆమోదం తీసుకోకపోవటంతో గణతంత్ర వేడుకల్లో తెలంగాణ శకటానికి చోటు లేకుండాపోయిందని పేర్కొన్నారు. సమావేశంలో తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు జంపాల రాజేశ్, జర్నలిస్టు రఘురాం పాల్గొన్నారు.

రహదారులపై అడ్డంగా ఉన్న స్తంభాల తొలగింపు

అధికారులను ఆదేశించిన టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, డిసెంబర్ 13(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో రహదారికి అడ్డంగా ఉండి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లను తొలగించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. మింట్ కాంపౌండ్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ శాఖ, టౌన్ ప్లానింగ్, టీజీ ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారుల సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. నగరంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న రహదారులతో పాటు షేక్‌పేట్, వనస్థలిపురం, ఎల్బీనగర్, గచ్చిబౌలి, ఉప్పల్, హబ్సిగూడ, మాసాబ్ ట్యాంక్‌తో పాటు ఇతర రద్దీగా ఉండే రహదారులపై అడ్డంకులను తొలగించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికై ఇతర శాఖల అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. టీజీ ఎస్పీడీసీఎల్ నుంచి డివిజనల్ ఇంజనీర్, ట్రాఫిక్ పోలీస్ శాఖ, జీహెచ్ంసీ, టౌన్ ప్లానింగ్ నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. ఈ నోడల్ అధికారులు టీంగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యటించి డిసెంబర్ చివరి నాటికి రోడ్డుకు అడ్డుగా నున్న వాటిని గుర్తించి వాటి తొలగింపునకు, తరలింపునకు అవసరమైన ఎస్టిమేషన్స్, అనుమతుల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. 2025 ఫిబ్రవరి నాటికి తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. దీనికి తోడు ఉపయోగంలో లేని విద్యుత్ స్తంభాలను, రోడ్డుపై పడి ఉన్న స్తంభాలను వెంటనే తొలగించాలని విద్యుత్ అధికారులను సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ శివ కుమార్, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ పి.విశ్వ ప్రసాద్, జాయింట్ ట్రాఫిక్ కమిషనర్ సి.జోయెల్ డేవిస్, డీసీపీలు వి.శ్రీనివాసులు, నరసింహులు, సీఈ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్ పర్సన్, రిటైర్డ్ అధికారిణి జీడీ అరుణ, తదితరులు

18న వెస్లీ మైదానంలో క్రిస్మస్ ఉత్సవాలు

46వ గ్రేటర్ హైదరాబాద్ వేడుకలకు ఏర్పాట్లు

కమిటీ చైర్‌పర్సన్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జీడీ అరుణ

మారేడ్‌పల్లి, డిసెంబర్ 13: ఈ నెల 18వ తేదీన సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులో వెస్లీ పీజీ కళాశాల మైదానంలో యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రెషన్స్ కమిటీ, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ సంయుక్త ఆధ్వర్యంలో 46వ గ్రేటర్ హైదరాబాద్ క్రిస్మస్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్‌పర్సన్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారిణి జీడీ అరుణ తెలిపారు. సెయింట్ మేరీస్ చర్చి ఆవరణలో కమిటీ ప్రధాన కార్యదర్శి స్టీవా గెలెలీ, కో చైర్మన్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏసుదాస్, వైస్ చైర్మన్ రాబర్ట్ సూర్యప్రకాష్ తదితరులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి ఈ ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఆయనతో పాటు పలువురు కార్డిన్ పూల ఆంథోని, సీఎస్ఐ డిప్యూటీ మాడరేటర్ రూబెన్ మార్క్, బిషప్ ఎంఏ డేనియల్, పాస్టర్ పురుషోత్తం తదితర ప్రముఖులతో పాటు అన్ని సంఘాలకు చెందిన బిషప్‌లు, పాస్టర్లతో పాటు సూమారు 20 వేల మంది వరకు క్రైస్తవులు హాజరవుతారని చెప్పారు. తెలుగు, ఇంగ్లిష్ టాబెర్ నాకిల్స్ క్వయర్‌తో మధురమైన పాటలను ఆలపిస్తారని చెప్పారు. బైబిల్ క్విజ్‌లతో పాటు క్రీస్తు పుట్టుకకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జేమ్స్ సిల్వెస్టర్, జాషువ, థామస్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

నాలాల ఆక్రమణలపై నోటీసుల జారీ

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 13: నాలాలు, బఫర్ జోన్ స్థలాలను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలకు కుత్బుల్లాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 5న నమస్తే తెలంగాణలో 'మిగులు స్థలాలను మింగేస్తున్నారు' అనే శీర్షికపై వచ్చిన కథనానికి అధికారులు స్పందించి నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన నిర్మాణాలపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని సెక్షన్ అధికారి రమేశ్ తెలిపారు.

నగరం.. నరకం

నగరం నిత్యం రణగొణ ధ్వనులమయం.. ఎక్కడ చూసినా వాహనాలు పేరుకుపోయి వర్షాకాలంలో గుర్రం పురుగులు ఒకదానిపై ఒకటి పేరుకుపోయి నడుస్తున్నాయన్న దృశ్యాన్ని గుర్తు చేస్తున్నాయి. వాహనాల వాడకాలు అమితమై.. నగరవాసులకు ప్రయాణమంటేనే భయానక భీతిని కలిగిస్తున్నాయి. అయినా తప్పని వాడుకకు ఇదో నిదర్శనం

మీరు తీసేస్తే.. మేం మళ్లీ పెట్టేస్తాం!

హడావిడి చేసి ఆపై వదిలేశారు

ఫుట్‌పాత్ మాఫియాను అడ్డుకోలేకపోతున్న పోలీస్

తాత్కాలికంగానే రోప్ అమలు

సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్‌లు, క్యారేజ్ వేలను ఆక్రమిస్తూ పాదచారులకు, ట్రాఫిక్ ఇబ్బందులు కల్గిస్తున్న ఆక్రమణలు తొలగించి సాఫీగా ట్రాఫిక్ సాగేలా చేయడానికి హైదరాబాద్‌లో ఆపరేషన్ రోప్ (రిమూవల్ ఆఫ్ అబ్జక్షక్టివ్ పార్కింగ్ అండ్ ఎంక్రోచ్‌మెంట్స్)ను చేపట్టారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సీవీ ఆనంద్ మొదటి సారి బాధ్యతలు నిర్వహించిన సమయంలోనే ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. ఆయన బదిలీ అయిన తరువాత ఈ ప్రాజెక్ట్‌ను క్షేత్ర స్థాయిలోని పోలీసులు అటకెక్కించారు. రెండోసారి ఆయన తిరిగి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత హైదరాబాద్‌లో ట్రాఫిక్ అవస్తలకు చెక్ పెట్టేందుకు ఆపరేషన్ రోప్‌ను తిరిగి ప్రారంభించారు. టోలీ చౌకీలో స్వయంగా సీపీ వెళ్లి ప్రారంభించడంతో పాటు నగరంలోని అన్ని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో రోప్‌ను నిర్వహించారు. ఫలాన పోలీస్‌స్టేషన్‌లో ఫలాన చోట రోప్ నిర్వహించామంటూ క్షేత్ర స్థాయిలోని అధికారులు ఉన్నతాధికారులు వాట్సాప్‌లో ఫొటోలు పెట్టి మరి మార్కులు కొట్టేశారు. ఆపరేషన్ రోప్ బాగానే జరుగుతుందని ఉన్నతాధికారులు భావిస్తూ వస్తున్నారు. అయితే, క్షేత్ర స్థాయిలో రోప్ నిర్వహించిన మరుసటి రోజే అదే స్థానంలో తిరిగి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు జరుగుతున్నాయి. రోప్ అమలుకు ముందున్న పరిస్థితి తిరిగి మరుసటి రోజు వచ్చేస్తోంది. దీంతో అక్కడ రోప్ నిర్వహించి ఏమి లాభమంటూ స్థానికులు పేర్కొంటున్నారు. రోప్ అంటూ హడావిడి చేయడం ఎందుకు? దానిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం ఏంటి? అంటూ సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

కొనసాగుతున్న ఫుట్‌పాత్ మాఫియా..

నగరంలో ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు చేపట్టిన రోప్‌తో ఫుట్‌పాత్ ఆక్రమణలు క్లియర్ అయ్యాయంటే రోడ్డు ప్రమాదాలు తగ్గడంతో పాటు ట్రాఫిక్ సాఫీగా పోతుంది. హైదరాబాద్‌లో ఫుట్‌పాత్ మాఫియా కొనసాగుతుంది. ట్రాఫిక్ పోలీసులలో కొందరు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు, అయితే, రాజకీయ నాయకుల జోక్యంతో కొందరు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మరికొందరు గట్టిగా ప్రయత్నం చేసి, వాళ్లకు ప్రత్యామ్నాయం చూపించలేక చేతులెత్తేస్తున్నవాళ్లు ఉన్నారు. మరికొందరు నెలవారీగా వచ్చే మామూళ్లకు అలవాటు పడిచూసీచూడనట్లు ఉండేవాళ్లు సైతం ఉన్నారు. ఆపరేషన్ రోప్‌తో సత్ఫలితాలు వస్తుంటాయి. ఫుట్‌పాత్‌ను పాదచారులు నడిచేందుకు మాత్రం ఉపయోగించాలి. ఆ ఫుట్‌పాత్‌ను కొందరు కిరాయికి ఇస్తున్నారు. మరికొందరు ఆక్రమించేస్తున్నారు. ఒక టిఫిన్ సెంటర్ ఉందంటే లోపల టిఫిన్స్, బయట ఛాయ్ బండి ఉంటుంది. ఛాయ్ బండి వేరే వాళ్లది నెలవారీగా కిరాయి తీసుకుంటుంటారు. బట్టల షాపు ఉందంటే.. దాని అనుబంధంగా ఉండే మరో చిరు వ్యాపారాన్ని తన దుకాణం ముందు పెట్టించి నెలవారి కిరాయి తీసుకుంటున్న వాళ్లు ఉంటున్నారు. ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు, టీ స్టాల్స్, బట్టల దుకాణాలు, హోటల్స్, టిఫిన్ సెంటర్స్ వంటివి ఎన్నో వెలుస్తున్నాయి. ఫుట్‌పాత్‌లపై చిన్నపాటి హోటల్స్‌నే నిర్వహిస్తున్నారు. ఇలాంటి హోటల్స్ నిర్వాహకులు ఎక్కడో ఉంటారు. దానిని కొందరు కిరాయికి ఇవ్వడంతో పాటు మరికొందరు ఆ హోటల్‌ను తమ సొంతంగానే నిర్వహిస్తున్న వాళ్లు ఉన్నారు. ఇలా హైదరాబాద్‌లో ఫుట్‌పాత్ వ్యాపారులను ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారే ఎక్కువగా ఆక్రమించేస్తున్నారని స్వయానా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

సికింద్రాబాద్ కింగ్ దర్బార్ చౌరస్తా పరిసరాలు

హడావిడి చేస్తే లాభం లేదు...!

రోప్ అనేది దీర్ఘకాలిక ప్రాజెక్ట్‌గా నడవాల్సిన అవసరముంది. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే వెంటనే తొలగించేస్తారనే భయం అక్కడ వ్యాపారాలు నిర్వహించే వారిలో రావాలి. ఇందుకు జీహెచ్ఎంసీ సహకారం కూడా పోలీసులకు ఎంతో అవసరముంటుంది. జీహెచ్ఎంసీ కొందరి వద్ద ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేసేందుకు జరిమానాలు వసూలు చేస్తుంది. అయితే, ఎంతో కొంత జరిమానా చెల్లిస్తూ కొందరు వ్యాపారులు అక్కడే తిష్ట వేస్తున్నారు. క్షేత్ర స్థాయిలోని ట్రాఫిక్ పోలీసులు రద్దీ సమయంలో రోడ్లపై ట్రాఫిక్ క్రబద్ధీకరణకు ఉంటారు. ఉదయం సాయంత్రం వేళల్లో చలాన్లు వేయడం, వసూళ్లు చేయడంపైనే ప్రత్యేక దృష్టి సారిస్తుంటారు. అలా కాకుండా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడే విధంగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు ఉంటే వాటిని దీర్ఘకాలిక ప్రాతిపదికన తొలగించాల్సిన అవసరముంది. ఉన్నతాధికారులు సైతం తరచు క్షేత్ర స్థాయిలో పర్యటించడం వల్ల ఏమి జరుగుతుందనేది పక్కాగా తెలుస్తోందని ప్రజలు సూచిస్తున్నారు.

అనుమతుల్లేకుండా.. నిర్మాణాలేంటి?

అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభంపై ఎస్ఎఫ్ఐ ఆందోళన

సీజ్ చేసిన విద్యాధికారులు

మేడ్చల్, డిసెంబరు 13: పాఠశాలకు ఎలాంటి అనుమతులు, భవన నిర్మాణం జరగకుండానే ఓ పాఠశాల యాజమాన్యం వచ్చే విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించింది. మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట గ్రామంలో ఉన్న మూత పడిన పరిశ్రమలో సవరణ (ఎడిఫై) పేరుతో పాఠశాలను ప్రారంభిస్తున్నట్టు పేర్కొంటూ మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంఛర్ కమాన్ వద్ద ఉన్న ఓ భవనంలో పాఠశాల కార్యాలయాన్ని ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలను ప్రారంభిస్తున్నట్టు పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదు. పాఠశాల ప్రారంభిస్తున్న చెపుతున్నట్టు చెపుతున్న పాఠశాలలో కూడా నిర్మాణ పనులు మొదలు కాలేదు. కానీ కరపత్రంలో మాత్రం క్రీడలు, స్విమ్మింగ్ తదితర ఎన్నో సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ప్రచారం నిర్వహిస్తూ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ మేడ్చల్‌లో ఉన్న పాఠశాల కార్యాలయానికి శుక్రవారం వెళ్లి, ఆందోళన నిర్వహించారు. అనుమతుల్లేకుండా ప్రవేశాలకు ఎలా తీసుకుంటారని యాజమాన్యాన్ని నిలదీశారు. మండల విద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే పాఠశాల కార్యాలయానికి వెళ్లి పాఠశాలకు సంబంధించిన పత్రాలను తీసుకెళ్లడంతో పాటు కార్యాలయాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ, పాఠశాలకు సరైన భవనం లేకుండా మేడ్చల్ పట్టణంలో కార్యాలయం ప్రారంభించి, అడ్మిషన్లు స్వీకరిస్తున్నారన్నారు. కంపెనీ భవనంలో పాఠశాల నిర్వహించడం ఏమిటి? అని ప్రశ్నించారు. అనుమతులు, సరియైన వసతుల్లేకుండా ప్రవేశాల పేరుతో లక్షల రూపాయలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎడిఫై పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, భవిష్యత్‌లో అనుమతు కూడా ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కార్యాలయాన్ని సీజ్ చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

నేడు కురుమల ఆత్మగౌరవ భవన నిర్మాణోత్సవం

రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలి రానున్న కురుమలు

మణికొండ, డిసెంబర్ 13: తెలంగాణ తొలి అమర వీరుడు, కురుమ యోధుడు దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, రాష్ట్రంలోని గ్రామ, గ్రామాల నుంచి వేలాదిగా కురుమ కులస్థులు తరలి రానున్నట్లు రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం పేర్కొన్నారు. కోకాపేట ఫేజ్-3 సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల రహదారిలో నిర్మితమైన దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం విచ్చేయనుండటంతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ రమణ గౌడ్, డీఎం అండ్ హెచ్‌ఓ వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం అధికారులు, కురుమ సంఘం రాష్ట్ర, నగర నాయకులతో కలిసి ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం, యెగ్గె మల్లేశం మాట్లాడుతూ, కురుమలు వేలాదిగా తరలి వచ్చి ఐక్యతను చాటనున్నారని తెలిపారు. 30 వేలకు పైగా తరలి వచ్చే కురుమలకు భోజన సదుపాయాన్ని కల్పించడంతో పాటు మంచి నీటి వసతి, ఉచితంగా వైద్య సేవలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రభుత్వ పరంగా ఏర్పాట్లు చేయడంతో కురుమ సంఘం ప్రతినిధులతో ముఖ్యమంత్రి సభ విజయవంతం చేసేందుకు గాను ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. అధికారులతో ఆయన ప్రాంతమంతా తిరిగి సీఎం సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాల ఎంపికను చేపట్టడంతో పాటు భోజన వసతి ఏర్పాట్ల గురించి చర్చించారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విచ్చేసి దొడ్డి కొమురయ్య భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

కోకాపేటలోని దొడ్డి కొమురయ్య భవన ప్రాంగణంలో ఏర్పాట్లను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ రమణ గౌడ్‌లతో కలిసి పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం, తదితరులు

టీఈఏ రాష్ట్ర స్పోర్ట్స్ సెక్రటరీగా రవీందర్ రెడ్డి నియామకం

సిటీబ్యూరో, డిసెంబర్ 13(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) రాష్ట్ర స్పోర్ట్స్ సెక్రటరీగా జి. రవీందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.నిర్మల చేతుల మీదుగా ఈ నియమాక పత్రాన్ని రవీందర్ రెడ్డి అందుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు సుగంధిని, ఇతర నాయకులు పాల్గొన్నారు.

లగచర్ల రైతు చేతికి బేడీలు వేయడాన్ని నిరసిస్తూ గుడి మల్కాపూర్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు దేవర శ్రీనివాస్ తదితరులు

రైతు చేతికి సంకెళ్లు సిగ్గుచేటు

కార్వాన్, డిసెంబర్ 13: ప్రజలకు అన్నం పెట్టే రైతన్న చేతికి సంకెళ్లు వేయడం తెలంగాణ ప్రభుత్వ రాక్షస పాలనకు నిదర్శనమని బీజేపీ కిసాన్ మోర్చా తెలంగాణ ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ పేర్కొన్నారు. లగచర్ల రైతు చేతికి సంకెళ్ళు వేయడాన్ని నిరసిస్తూ బీజేపి కిసాన్ మోర్చా కార్వాన్ కన్వీనర్ గోద లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో గుడి మల్కాపూర్‌లోని మహాత్మా జ్యోతి బా పూలే విగ్రహం వద్ద తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గత ఏడాది కాలంగా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ నిరంకుశ పాలన సాగిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజలను హింసిస్తే వారిని రక్షించేందుకు బీజేపి ఉందన్నారు. కాంగ్రెస్ విధానాలు ఇలాగే కొనసాగితే ఆ పార్టీని ప్రజలే బొంద పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముఖేశ్ సాగర్, సందేష్ యాదవ్, సుధాకర్ యాదవ్, శ్రీకాంత్ సాగర్, ప్రభు పూజారి, వెంకటేష్ సాగర్, సునీల్ బోలే, ఆకుల శ్రీకాంత్, వి. వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలం

అల్లు అరెస్ట్‌ను ఖండిస్తున్నా.. ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్, డిసెంబర్ 13: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి శాంతి భద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ఆరోపించారు. సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ, నటుడు అల్లు అర్జున్ సంధ్య థియేటర్ వద్దకు వచ్చిన విషయాన్ని తమకు తెలపలేదని పోలీసులు అంటున్నారని, కానీ, సంధ్య థియేటర్ యజమాని మాత్రం తాము నగర పోలీస్ కమిషనర్‌కు సమాచారం అందించినట్లు తెలిపారన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు గుమికూడి తొక్కిసలాట చోటు చేసుకుని మహిళ చనిపోయినది. ఈ కేసులో సంధ్య థియేటర్ యాజమాన్యం సమాచారం అందించిన అనంతరం, పోలీస్ బలగాలు భద్రతా ఏర్పాట్లు చేయక పోతే నటీ నటుల తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెబుతున్నారని, ఎక్కడ చేసుకు పోతోందని? ప్రశ్నించారు. సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్ట్‌ను ఖండిస్తున్నట్లు రాజాసింగ్ తెలిపారు.

తండ్రిని సజీవ దహనం చేసిన కొడుకు

నిందితుడికి యావజ్జీవ శిక్ష విధించిన న్యాయస్థానం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబర్ 13(నమస్తే తెలంగాణ): గంజాయికి అలవాటు పడ్డ కొడుకు, తనను తండ్రి పట్టించుకోవడం లేదని తండ్రిపై పెట్రోల్ పోసి తగలబెట్టి హత్య చేసిన ఘటన తుర్క యంజాల్‌లో చోటు చేసుకుంది. కసాయి కొడుకు తిరుపతి అనురాగ్(25)కు యావజ్జీవకారాగార శిక్ష మరియు వెయ్యి రూపాయల జరిమాన విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి తీర్పునిచ్చారు. అదనపు పిపి యస్.శోభారాణి కథనం ప్రకారం.., తుర్క యంజాల్ చెందిన రవీందర్ తన భార్య ఇద్దరు కుమారులతో కలిసి ఆరెంజ్ అవెన్యూ కాలనీ, తుర్క యంజాల్‌లో నివాసం ఉంటున్నాడు. పెద్ద కుమారుడైన అనురాగ్ ఏ పని చేయకుండా ఇంట్లోనే ఉంటూ గంజాయికి అలవాటు పడి తల్లిదండ్రులను దూషిస్తూ, కొడుతూ ఉండేవాడు. దీంతో గతంలో మూడు నెలల పాటు డ్రగ్స్ డీ అడిక్షన్ సెంటర్‌కు పంపించి ట్రీట్‌మెంట్ ఇప్పించారు. అయినా, తీరు మార్చుకోని నిందితుడు తనను పట్టించుకోవడంలేదని నిత్యం కుటుంబ సభ్యులతో ఘర్షణ పడేవాడు. అయితే, తనను పట్టించుకోని తండ్రిని ఎలాగైనా అంతమొందించాలని కుట్ర పన్ని అనురాగ్ పదిరోజుల ముందే పెట్రోల్ కొనుగోలు చేసి బాటిల్‌ను ఇంట్లో దాచిపెట్టాడు. 2024 ఏప్రిల్ 4న భోజనం చేస్తున్న తండ్రిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అరుస్తూ, బయటకు వెళ్ళి కింద పడిపోయిన తన తండ్రి తలపై రాయితో కొట్టి హత్య చేశాడు. జరిగిన ఘటనపై తల్లి సుధ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన ఆదిభట్ల పోలీసులు నిందితుడు అనురాగ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న ఏఐవైఎఫ్ నేతలు ధర్మేంద్ర, సత్యప్రసాద్

సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 13: సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు 4వ రోజు చేపట్టిన దీక్ష శిబిరాన్ని ఏఐవైఎఫ్ నేతలు శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ, ద్వితీయ శ్రేణి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, రాష్ట్ర ముఖ్యమ